## క్లుప్తంగా...

### టప్పాచబుత్ర క్రైం ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ ఆసీఫ్



అబిడ్స్: టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ ఆసీఫ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసీఫ్ నిజామాబాద్‌లోని పలు పోలీస్‌స్టేషన్లలో, ట్రాన్స్‌కో విజిలెన్స్‌లలో పనిచేశారు. గతంలో క్రైం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రాజశేఖర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పదోన్నతి పొంది మహ్మద్ ఆసీఫ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలను నిరోధించేందుకు ప్రత్యేక నిఘా చేపడుతామన్నారు. అనంతరం మహ్మద్ ఆసీఫ్‌కు ఇన్‌స్పెక్టర్ ఆకుల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

### రెండు కొత్త రూట్లలో బస్సులు ప్రారంభం



బస్సులను ప్రారంభిస్తున్న ఈడీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత

సంతోష్‌నగర్: మిధాని డిపో నుంచి 90బీ/ఈ బడంగ్‌పేట్ నుంచి ఈసీఐఎల్‌కు వయా మిధాని, ఎల్‌బీనగర్, ఉప్పల్, తార్నాక, వైట్ హౌస్, లాలాపేట్, మౌలాలి మీదుగా 4 కొత్త బస్సులను సోమవారం ఈడీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత ప్రారంభించారు. అదే విధంగా 90ఎల్/కే ఎల్‌బీనగర్ నుంచి కాచిగూడ స్టేషన్ వయా ఉప్పల్, తార్నాక, విద్యానగర్, శంకర్‌మఠ్, నల్లకుంట, బర్కత్‌పుర మీదుగా 3 కొత్త బస్సులను సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిధాని డిపో మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### మసీదు మరమ్మతు పనులకు నిధులు మంజూరు

గోల్కొండ: మసీదు మరమ్మతులకు మొదటి విడత రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మొదటి విడతగా రూ.లక్ష మంజూరు చేసిందని ఎమ్మెల్యే కౌసర్ తెలిపారు. 400 సంవత్సరాల క్రితం నాటి కలి కుతుబ్‌షాహి మసీదు పునరుద్ధరణకు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే కౌసర్ మసీదు మరమ్మతులకు రూ.25 లక్షలు కేటాయించాలని కోరారు. ఇది ఇలా ఉండగా ఈ మసీదుపై గత నెలలో పిడుగుపడింది. ఈ పిడుగు పాటుకు మసీదు మినార్ పాక్షికంగా దెబ్బతింది. మొదటగా మసీదు మినార్ మరమ్మతుల కోసం సోమవారం వక్ఫ్‌బోర్డు వారు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు.

### ‘బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకో’



ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి బండి సంజయ్‌కి లేదన్నారు. అబిడ్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నుంచి మంత్రి కేటీఆర్ పోటీచేస్తే తమ రాజాసింగ్ చూసుకుంటాడని ఆయన అనడం అవివేకమన్నారు. బండి సంజయ్ పోటీ చేస్తే తమ బీఆర్‌ఎస్ సత్తా చూపుతామని ఆయన అన్నారు. గోషామహల్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు.

### గృహిణి ఆత్మహత్య

లంగర్‌హౌస్: గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌కు చెందిన లక్ష్మి(38), అశోక్ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కొద్ది సంవత్సరాల క్రితం నగరానికి వచ్చిన వీరు లంగర్‌హౌస్ బాపునగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. సోమవారం ఉదయం తమ కుమారుడిని పాఠశాల వద్ద దింపడానికి వెళ్లే విషయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఆ తర్వాత అశోక్ స్నానం చేయడానికి బాత్‌రూంకి వెళ్లగా, కుమారుడు దోస తెచ్చుకోడానికి వెళ్లాడు. ఆ సమయంలో లక్ష్మి ఫ్యాకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం ఉస్మానియా మార్చురీలో ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

# ప్రజా యుద్ధనౌకకు ఘన నివాళి

అబిడ్స్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి తెలంగాణ సమాజానికే తీరని లోటు అని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్ గుప్తా పేర్కొన్నారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన, తెలంగాణ ఏర్పాటులో తన అమృతమైన గానంతో కృషి చేసిన నాయకుడు గద్దర్ అని ఆయన అన్నారు.

**వెంకటేశ్ ఆధ్వర్యంలో..**

గౌలిపురా: ప్రజా యుద్ధనౌక గద్దర్ భౌతికకాయానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లాల్‌దర్వాజా మహంకాళి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ సోమవారం ఉదయం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన గద్దర్ భౌతికకాయాన్ని సందర్శించి



నివాళులర్పిస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్

నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన ఆట, పాటలతో ఉద్యమకారుల్లో జోష్ నింపి రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యారన్నారు.

**గద్దర్ మృతి కళారంగానికి తీరని లోటు..**

నాంపల్లి: గద్దర్ మృతి బాధాకరమని ఓం కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్‌కే రాజు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని గన్‌పార్కు వద్ద గద్దర్ భౌతికకాయానికి పుష్పగుచ్ఛాన్ని సమర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుభూతిని, అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గద్దర్ మృతి కళారంగానికి తీరని లోటని అభివర్ణించారు.

**లాల్‌దర్వాజా మోడ్ వద్ద..**

చార్మినార్: గద్దర్‌కు లాల్‌దర్వాజా మోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, భాస్కర్, కృష్ణకుమార్, శ్యాంరావుముదిరాజ్, క్రాంతికుమార్, రాజుయాదవ్, సుభాష్, శ్రీనివాస్, పృథ్వీరాజ్, నరసింహ పాల్గొన్నారు.

**పురానీహవేలిలో..**

యాకుత్‌పురా: గద్దర్ మరణం తీరని లోటని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు న్యాయవాదులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గద్దర్ చిత్రపటానికి సోమవారం పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదులు పూలమాల వేసి మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కో కన్వీనర్లు మాణిక్ ప్రభుగౌడ్, ఎం.ఎస్.తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ప్రజా గొంతుక మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి రఘువీరారెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



గన్‌పార్కు వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎస్ఎస్‌కే రాజు



లాల్‌దర్వాజా మోడ్ వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## సంక్షేమ పథకాలు పేదలకు అందేందుకు చర్యలు

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తెలిపారు. చార్మినార్ మండల పరిధిలో షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం యాకుత్‌పురా ఆల్ ఉస్నా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కార్పొరేటర్లతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతో బాధపడుతున్న ఆడ కూతుళ్ల పెళ్లిలకు షాదీ ముబారక్ పథకం బాసటగా నిలుస్తుందన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తూ ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, మొఘల్‌పురా, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, ఆలంధార్ వాలా జహీ, చార్మినార్ మండల డిప్యూటీ తహసీల్దార్ ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

### టీ-టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా హబీబ్ మహమ్మద్



చార్మినార్: టీ-టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా చార్మినార్ నియోజకవర్గానికి చెందిన హబీబ్ మహమ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన టీ-టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

### కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 34 కేజీల గంజాయి స్వాధీనం

నాంపల్లి: కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఏపీ నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే పోలీసులు ఈనెల 6న భువనేశ్వర్ టు ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నంబరు 11020ను తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా రైలులో కనిపించారు. మహారాష్ట్ర అహ్మద్‌నగర్, శ్రీరాంపూర్ చెందిన ఎస్.రామేశ్వర్ కుమారుడు రాహుల్, మహారాష్ట్ర, జల్నా జిల్లా బొరాగో గ్రామానికి చెందిన ఆకాష్‌రావు బ్యాగులలో 34 కేజీల గంజాయి లభించినట్లు వివరించారు. దొరికిన గంజాయిని ఏపీ నుంచి మహారాష్ట్రలోని పూణేకి తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న దొంగలను పట్టుకున్న సీఐబీ ఇన్‌స్పెక్టర్ రవిబాబు, ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ నర్సింగ్ రాథోడ్‌ను సికింద్రాబాదు రైల్వే ఎస్పీ షేక్ సలీమా అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

## పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత చిక్కా రామదాస్ రచించిన పద్యామృత వర్షిణి పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. రామదాసు రచనలు ఎంతో సరళంగా ఉంటాయని కొనియాడారు. అనంతరం కనకాచారి, గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్‌కు పురస్కారాలను అందజేయగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నేటినిజం పత్రికా సంపాదకులు దేవదాస్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ అనంతలక్ష్మి, తెలుగు సాహిత్య కళాపీఠం కార్యనిర్వాహక అధ్యక్షులు ఈటల సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

### అసభ్యకరంగా మెసేజ్‌లు పంపిన స్కూల్ ఇన్‌చార్జి అరెస్టు

గోల్కొండ: తన వద్ద చదువుకున్న ఓ విద్యార్థినికి వాట్సాప్‌లో అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టిన ఓ ప్రైవేటు పాఠశాల ఇన్‌చార్జిను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సోమవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత బాలిక కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నదీమ్‌కాలనీకి చెందిన అహ్మద్ నదీమ్‌కాలనీలో క్యాంబ్రిడ్జ్ క్రియేటివ్ స్కూల్ నిర్వహిస్తున్నాడు. ఇతడు ఈ స్కూల్‌కు అహద్ అలీను ఇన్‌చార్జిగా నియమించాడు. అహద్ అలీ పాఠశాల యజమాని అహ్మద్‌కు సమీప బంధువు. టోలిచౌకికి చెందిన ఓ బాలిక ఈ స్కూల్‌లో 10వ తరగతి చదువుకుంది. చదువు పూర్తయిన తర్వాత అహద్ అలీ ఆ బాలికకు ఫోన్ చేస్తూ అసభ్యకరంగా మెసేజ్‌ల పెడుతున్నాడు. నీ ఫొటోలు పంపు అంటూ బాలిక ఫొటోలు కూడా వాట్సాప్ ద్వారా తెప్పించుకున్నాడు. సులువుగా డబ్బు సంపాదించే మార్గం చెబుతానని నమ్మబలికాడు. నేను చెప్పిన వ్యక్తుల వద్దకు వెళ్తే వారు నీకు డబ్బులు ఇస్తారు అంటూ ప్రలోభపెట్టాడు. దీంతో భయపడ్డ అమ్మాయి ఆదివారం రాత్రి తన కుటుంబ సభ్యులకు చెప్పింది. దీనిపై ఆ బాలిక కుటుంబసభ్యులు సోమవారం గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి ఇరువురి ఫోన్‌లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

సుల్తాన్‌బజార్: క్షయ రహిత సమాజం కోసం 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను వెంటనే క్రమబద్ధీకరించాలని డీపీ కంట్రోల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు సోమవారం కోఠి డీఎంఈ కార్యాలయం వద్ద వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 20 ఏళ్లుగా క్షయ నివారణ కార్యక్రమంలో పాల్గొంటున్న సూపర్‌వైజర్లు, స్టాటటికల్ అసిస్టెంట్ ఎస్.డీపీఎస్, టీపీఎం తదితర క్యాడర్లలో 703 మంది కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ క్యాడర్ల నాయకులు జగత్ సతీష్ విజయ్‌కుమార్, రాంచందర్ ప్రసాద్, రత్నం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తదితరులు

### గర్భిణిపై దాడికి పాల్పడిన వ్యక్తికి ఏడు రోజుల జైలు

సంతోష్‌నగర్: కుటుంబ తగాదాల్లో గర్భిణిపై దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి సోమవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు 7 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబా నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ షానవాజ్ (27) కుటుంబ తగాదాల్లో గర్భిణిపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మహ్మద్ షానవాజ్‌పై ఈ-పెట్టీ కేసు నమోదు చేశారు. అనంతరం మహ్మద్ షానవాజ్ పోలీసులు సోమవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా.. మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు మహ్మద్ షానవాజ్ 7రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## ‘విలీనం’పై ఆర్టీసీ కార్మికుల సంబరాలు



మెహిదీపట్నం డిపో ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల సోమవారం కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మెహిదీపట్నం డిపో ఎదుట తెలంగాణ అమరవీరులను స్మరించుకొని నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం వల్ల 43 వేల ఆర్టీసీ కార్మిక కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు పీఆర్సీ లాంటి అనేక బెనిఫిట్స్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పొందవచ్చని తెలిపారు. ఈ నిర్ణయం కార్మికులకు వరం లాంటిదన్నారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వెంకటకృష్ణమూర్తిల సారథ్యంలో తమ డిపో లాభాల బాట పట్టేందుకు ఎంతో కృషి చేశామని, ఇక ముందు కూడా నిబద్ధతతో పనిచేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నమ్రత, ఎంఎఫ్ ఎంఏ రెహ్మాన్, టీఐ-3 బి.నర్సింహాగౌడ్, ఉద్యోగుల సంక్షేమ బోర్డు సభ్యులు భావన, ఎంఏ సలీమ్, సెక్యూరిటీ ఇన్‌చార్జి పి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పేదలకు అండగా ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం పలువురు ఆయన వద్దకు వచ్చి తమ ఫిర్యాదులను చెప్పుకున్నారు. మరికొందరు తాము డబుల్ బెడ్‌రూంకు దరఖాస్తులు చేసుకున్నామని తమకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని విధాలుగా అర్హులైన వారికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తుందన్నారు. ఇళ్ల కేటాయింపులో తన ప్రమేయం గానీ, అధికారుల ప్రమేయం కానీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తుల విచారణ కోసం ప్రత్యేక బృందాలు వస్తాయని నిష్పక్షపాతంగా విచారణ జరపాలని తనిఖీ బృందాలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. డ్రైనేజీ లైన్ల మరమ్మతు పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు.



ఫిర్యాదులు తీసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

## విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ



గోల్కొండ: పేద విద్యార్థులకు తెలంగాణ యూత్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ తమవంతు సహాయంగా నోటు బుక్స్, పాఠ్య పుస్తకాలు అందిస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ అలీ అన్నారు. సోమవారం ఆయన జోషివాడీ కార్వాన్‌లోని భగత్‌సింగ్ ప్రైమరీ హైస్కూల్‌లో విద్యార్థులకు నోటు బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వారు చదువుకునేలా తాము గత దశాబ్ద కాలంగా కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే పేద విద్యార్థులకు చదువుపై మరింత శ్రద్ధ కనబరిచేందుకు చదువు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహ్మద్ షాకీర్, జోషి సమాజ్ అధ్యక్షుడు ఈశ్వర్‌జోషి, పాఠశాల ఉపాధ్యాయులు వనిత, నవీన్ తదితరులున్నారు.

### సమాజ సేవకు ‘జేసీఐ హైదరాబాద్ దక్కన్’ కృషి

అబిడ్స్: సమాజ సేవకు జేసీఐ హైదరాబాద్ దక్కన్ నిరంతరం కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా జేసీఐ చేస్తున్న సేవలు అమోఘమన్నారు. జేసీఐ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా తంబోలా, మ్యూజికల్ ఫ్యాషన్ షో వేడుకలను బీజేపీ నాయకురాలు భాగవతి బల్‌దేవాతో కలిసి ప్రారంభించారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. జేసీఐ హైదరాబాద్ దక్కన్ తరహాలో మిగతా సంస్థలు కూడా సమాజ సేవకు పాటుపడాలన్నారు. ఆధ్యాత్మికంగా, సామాజికంగా, ప్రజా సంక్షేమం కోసం, పేద ప్రజల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపట్టిందని ఆయన కొనియాడారు.



వేడుకల్లో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

### ఆకట్టుకున్న శ్రావ్య భరతనాట్య అరంగేట్రం



గన్‌ఫౌండ్రీ: నాద్ స్టూడియోస్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు నేహ పటేల్ శిష్యురాలు గన్న శ్రావ్య భరతనాట్య అరంగేట్రం సోమవారం కనుల పండుగగా జరిగింది. యూఎస్‌లో ఉంటూ భారతీయ కళలపై ఆసక్తితో నృత్యాలను నేర్చుకొని స్వదేశంలో ప్రదర్శన ఇవ్వడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు ప్రమోద్, నిత్య కల్యాణి, అనుపమ కైలాష్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశాలు నిర్వహించాలి

నాంపల్లి: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్ సోమవారం పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసు సిబ్బందితో సమావేశాలు నిర్వహించి జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరవింద్ కుమార్‌తో పాటుగా ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో రాధికా జైస్వాల్

## ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలం



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్ శ్రీకృష్ణ భవన్‌లో బీసీ ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యంగా లేకపోవడం వల్లే నేడు ఎన్నో కులాలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగలేకపోయాయన్నారు. కాగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కుల సంఘాలు ప్రతిష్టంగా ఉన్నాయని ప్రభుత్వాలతో పోరాడి అవి తమ హక్కులు సాధించుకున్నాయన్నారు. ముఖ్యవక్తగా పాల్గొన్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. యాదవులకు గతంలో చట్టసభల్లో మంచి ప్రాతినిధ్యం ఉండేదని నేడు వాటి ప్రాధాన్యం తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాటం నర్సింహాయాదవ్, బోడి అశోక్‌యాదవ్, రాధాకిషన్‌యాదవ్ తదితరులున్నారు.

### విద్యార్థినులకు ఆకాశమే హద్దు

చార్మినార్: దృఢ సంకల్పంతో ఉంటే మహిళలకు అసాధ్యం అనేది ఏమి లేదని జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఫరీహా అహ్మద్ అన్నారు. పాతబస్తీలోని డాన్ హై స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థినులకు ఎటువంటి హద్దులు లేవని.. ఆకాశమే హద్దునని ఆమె కొనియాడారు. నేటి పోటీ యుగంలో విద్యార్థినులు దేశంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా పోటీ పడేందుకు నిరంతరం సిద్ధంగా ఉండాలని ఆమె విద్యార్థినీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాన్ గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఫజ్లుర్ రెహ్మాన్ ఖుర్రం, సీనియర్ న్యాయవాది ఇంతియాజ్, మంజూర్, డాక్టర్ గులాం అబ్బాస్, షజీ ఉల్లా ఫిరాసత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫరీహా అహ్మద్

## వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: వ్యాధి నిరోధక టీకాలపై పిల్లల తల్లిదండ్రులకు, గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర వ్యాధి నిరోధక టీకాల జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ అన్నారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా యూపీహెచ్‌సీ కోఠిలో ఆమె జ్యోతి వెలిగించి మిషన ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు పిల్లలకు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఇవ్వాల్సిన బాధ్యత తమ ఆరోగ్య శాఖ సిబ్బందిపై ఉందని తెలిపారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ, ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ పద్మజ, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనైజేషన్ డాక్టర్ కార్తీక్, జిల్లా ఎమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీకళ, యూపీహెచ్ కోఠి వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ నర్సుబి పాల్గొన్నారు.